క్లుప్తంగా

సీసీ కెమెరాలకు మరమ్మతు



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు పలుప్రాంతాల్లో రెండేళ్ల కిందట అమర్చిన సీసీ కెమెరాలు చెడిపోగా, మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మరమ్మతులు చేపట్టారు. పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు కోతులు, వర్షాల కారణంగా పని చేయకపోవడంతో పోలీసుల ఆధ్వర్యంలో సరిచేశారు.

నేడు బంద్‌కు పిలుపు

కాటారం: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, దేవాలయాల ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ పలు హిందూ సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) మండలంలో బంద్‌కు పిలుపునిచ్చారు. మండలంలోని వాణిజ్య, వ్యాపార సముదాయాలు, ఫర్టిలైజర్స్, పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమకు సంపూర్ణ మద్దతు ప్రకటించి హిందూ ఐక్యతను చాటాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



టేకుమట్ల: మండలంలోని వెలిశాల ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందించారు. అనంతరం చదువుకునే రోజుల్లో తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుని, ఆట పాటలతో సంతోషాన్ని పంచుకున్నారు. మృతి చెందిన తోటి బాల్య మిత్రుల ఆత్మకు శాంతి చేకూరేందుకు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పింగిళి నారాయణరెడ్డి, చంద్రశేఖర్, సాంభలింగాచారి, దేవేందర్, రమేష్, కోట్యానాయక్, క్రిష్టారావు, అశోక్, రాజు, రేణుక, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ దొంగల అరెస్ట్

శాయంపేట : వ్యవసాయ బావుల వద్ద బిగించిన విద్యుత్ మోటార్లను సాయిదత్త క్రషర్‌లో కాపర్‌వైరును దొంగిలించిన ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని జోగంపల్లి గ్రామ రైతులు పంట పొలాలకు సాగునీరు అందించడానికి కెనాల్‌లో విద్యుత్ మోటార్లను బిగించగా గుర్తు తెలియని వ్యక్తులు వాటిని ఎత్తుకొని వెళ్లారు. మాందారిపేట గుట్టలలోని సాయిదత్త క్రషర్‌లో కాపర్‌వైరు దొంగతనం జరిగింది. ఈ రెండు ఘటనలపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దొంగలను పట్టుకోవడానికి పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఆటోలో ఐదుగురు వ్యకులు వెళ్తుండగా పెట్రోలింగ్ వాహనాన్ని ఆపి ఆటోను వెనక్కి తిప్పుకొని పారిపోతుండగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకొని విచారించినట్లు తెలిపారు. ఆటోలో 4 ఎలక్ట్రికల్ మోటార్లు, 10 కిలోల కాపర్‌వైరు, ఇనుప సామాగ్రి ఉండడంతో వారిని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. పెద్దకోడెపాకకు చెందిన ఆటోడ్రైవర్ గోవిందు వెంకటేష్, మంద భద్రయ్య, పరకాల పట్టణం వెల్లంపల్లికి చెందిన కేదారి దుర్గభవాని, కుంభం అరుణ, కండెల లక్ష్మిలపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.



టేకుమట్ల: పోలీసులకు రాఖీ కడుతున్న మహిళలు



టేకుమట్ల: రాఖీ కడుతున్న చిన్నారులు



చిట్యాల: అన్నకు రాఖీ కడుతున్న సోదరీలు

ప్రేమానురాగాలకు ప్రతీక 'రాఖీ'

జిల్లా వ్యాప్తంగా రక్షాబంధన్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. సోదరీలు సోదరులకు రాఖీలు కట్టి ప్రేమను చాటుకున్నారు. అన్నాదమ్ముళ్లు తమ అక్కా చెల్లెళ్ల ఆశీర్వాదం తీసుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

- సాక్షి నెట్‌వర్క్



వాజేడులో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరీ



కన్నాయిగూడెంలో..



వెంకటాపురం(కె)లో..



వాజేడు: డీఎంహెచ్ఓ సాంబశివరావుకు రాఖీ కడుతున్న సోదరి



వెంకటాపురం(ఎం)లో..



వాజేడులో..



కాటారంలో..



కన్నాయిగూడెం: అన్నకు స్వీటు తినిపిస్తున్న చెల్లె



చల్వాయిలో అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లె

రహదారిపై గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చివేస్తున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి 163వ జాతీయ ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతలను సోమవారం ఏటూరునాగారం ఎస్సై తాజొద్దీన్ గుంతలను పూడ్చివేయించాడు. ఈ మార్గంలో ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడడంతో రాత్రిపూట వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలను గమనించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం జరిగిన సంఘటనలు ఉన్నాయి. దీంతో ఎస్సై గుంతలను పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు అతి వేగంగా, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దన్నారు. రోడ్లపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను గమనించి నిదానంగా వెళ్లాలని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం వెంకటాపురం(కె) ఎస్సై కొప్పుల తిరుపతి రావు ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని కొండాపురం, సూరవీడు, సూరవీడు కాలనీ, విజయపురి కాలనీ, ఎదిర, యాకన్నగూడెం, ఒంట చింతల గూడెం గ్రామాల్లో 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. కమ్యూనిటీ పోలీసింగ్‌లో మేము సైతం కార్యక్రమంలో భాగంగా గ్రామస్తుల సహకారంతో కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిగతా గ్రామాల్లో కూడా ప్రజలు సహకరించాలని కోరారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రణధీర్

ఎస్ఎస్ తాడ్వాయి: ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యాధికారి రణధీర్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రా ఆదేశాల మేరకు వైద్య శిబిరం నిర్వహించి పాఠశాలలోని విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మలేరియా పరీక్షల కోసం రక్త నామునాలను సేకరించినట్లు పేర్కొన్నారు. కీటక జనిత వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై వివరించారు. పాఠశాల అవరణలో నీటి నిల్వ ఉన్న ప్రదేశాలను పూడ్చివేయాలన్నారు. ఈ వైద్యశిబిరంలో డీపీఎంఓ సంజీవరావు, ఏఎన్‌ఎంలు మంగ, జ్యోతి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలో థీమ్ చిల్డ్రన్ హ్యాపినేస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాలలోని గొత్తికోయల విద్యార్థులకు ఇన్ఫోసిస్ ప్రతినిధులు వంశీ ముత్యాపు, ఆదిత్య కృష్ణ, సుమత్, హర్ష, యశ్వంత్ సోమవారం బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో విద్యను ప్రోత్సహించే ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌కు కృషి చేస్తుందని తెలిపారు. ఆదివాసీ పిల్లలకు విద్యను, సంక్షేమాన్ని పెంపొందించే లక్ష్యంతో పనిచేస్తున్న థీమ్ చిల్డ్రన్ హ్యాపినెస్ సెంటర్‌కు ఈ బ్యాగులు అందిస్తున్నట్లు తెలిపారు. విరాళానికి సహకరించిన ఇన్ఫోసిస్ ఉద్యోగి స్వప్నకు, ఫౌండేషన్‌కు థీమ్ చిల్డ్రన్ హ్యాపినెస్ సెంటర్ బృందం దూడపాక నరేష్, శేసిందర్‌రెడ్డి, రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.



బ్యాగులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ బృందం

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



టేకుమట్ల: డాగూరే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు



కాళేశ్వరంలో..

మల్హర్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మండల ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం తాడిచర్లలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా లూయిస్‌జాకస్ డాగూరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ మండల మాజీ అధ్యక్షుడు జక్కుల రమేశ్, ప్రధాన కార్యదర్శి సలాది నవీన్, కోశాధికారి ఆకుల సతీష్, సభ్యులు సతీష్, మధునయ్య, రాజశేఖర్ తదితలు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో రోగులకు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ యూనియన్ సభ్యులు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి సంబురాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మేకల రాజేశ్, ప్రధానకార్యదర్శి పెండ్యాల పెద్ద నరసింహస్వామి, కోశాధికారి పెండ్యాల చిన్న నరసింహస్వామి, గౌరవ అధ్యక్షుడు బుర్ర లింగయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు కావేరి సంతోష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పంతకాని సమ్మయ్య, చిప్ప జయంత్, ఊరగొండ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

టేకుమట్ల: ఫొటోగ్రఫీ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఫొటో కెమెరా సృష్టికర్త లూయిస్ జూకస్ మండే డాగూరే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫొటోగ్రఫీ అసోసియేషన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసారపు సదానందం, నిమ్మల దేవేందర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్‌ల రాకతో ఫొటోగ్రాఫర్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం శుభకార్యాలయాలకు మాత్రమే ఫొటోగ్రాపర్లు పని చేస్తున్నారని, పర్యాటకం ప్రాంతాల్లో, పాస్ ఫొటోలను తీసేందుకు సెల్ ఫోన్లే వాడుతున్నారని అన్నారు. కావున ప్రభుత్వం స్పందించి ఫొటోగ్రాఫర్లకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. ఫొటోగ్రాఫర్లు బొంగోని నరేష్, తిరుపతి, బండ రఘోత్తంరెడ్డి, సోమిడి లింగమూర్తి, బొల్లికొండ వెంకటేష్, ఆకునూరి సతీష్, ఎరివెల్లి మహేష్, సురేందర్ పాల్గొన్నారు.



మల్హర్: కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

రోడ్లు ఇలా.. వెళ్లేది ఎలా?

- ధ్వంసమైన రహదారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

మహాముత్తారం: మండలంలోని నిమ్మగూడెం, యత్నారం, సింగంపల్లి నుంచి కనుకునూర్ వరకు గతంలో నిర్మించిన బీటీరోడ్డు పూర్తిగా ధ్వంసంది. వర్షాకాలం వచ్చిందంటే ఈ రహదారి గుండా వాహనదారులు, రైతులు వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. సుమారు మూడు గ్రామాలను కలుపుకుని రహదారి 16 కిలోమీటర్లు ఉంటుంది. ప్రతీ సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే భారీ గుంతలతో నీరు నిండి ఉండటమే కాకుండా రోడ్డు భారీగా కోతకు గురై కంకర తేలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగంపల్లి, కనుకునూర్, పలిమెల మండలం మోదేడు గ్రామానికి చెందిన ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే కనుకునూర్, పెగడపల్లి మీదుగా రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో దూర భారం పెరిగి డబ్బులు అదనంగా ఖర్చు అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు ధ్వంసమై సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుగుండా ప్రయాణించిన వాహనదారులు అదుపుతప్పి పడిపోయి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ అవినాష్‌ను వివరణ కోరగా ఎల్‌డబ్ల్యూఈ స్కీం కింద రూ.12కోట్లు మంజూరయ్యాయని రోడ్డు నిర్మాణం కోసం అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో నిర్మాణం నిలిచిపోయిందని తెలిపారు.



సింగంపల్లి యత్నారం మధ్యలో కోతకు గురైన రోడ్డు



నిమ్మగూడెం యత్నారం మధ్యలో..



యత్నారం సమీపంలో ధ్వంసమైన రోడ్డు

సభ్యత్వ నమోదు చేపట్టాలి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న నాయకులు

కాటారం: యువజన కాంగ్రెస్ ఎన్నికల నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామగ్రామాన చేపట్టాలని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య యూత్ కాంగ్రెస్ నాయకులకు సూచించారు. మండల కేంద్రంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన నాయకులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. మండలంలో అధిక సంఖ్యలో సభ్యత్వాలు చేపట్టి నియోజకవర్గంలోనే ప్రథమంగా నిలవాలని పేర్కొన్నారు. సభ్యత్వాల సంఖ్యను పెంచడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, యువ నాయకుడు శ్రీనుబాబు ఆదేశాలతో యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా జక్కిడి శివచరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండ కిశోర్‌రెడ్డి, మంథని నియోజకవర్గ అధ్యక్షుడిగా చీమల సందీప్ బరిలో నిలుస్తున్నారని తెలిపారు. అధిక మెజారిటీతో వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణుల అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీమల సందీప్, నాయిని శ్రీనివాస్, ఆత్మకూరి కుమార్‌యాదవ్, గడ్డం కొంరయ్య, బొడ్డు రాజశేఖర్, జియ్యారి మల్లేశ్, చిలువేరు రూపేశ్, ప్రవీణ్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

దామెర : మండల కేంద్రంలో పునర్నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఉదయం సుప్రభాత సూక్తోపనిషత్ పారాయణం, గ్రామానికి తోరణ బంధన, గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకధారణ, అఖండ ప్రజ్వలన, అగ్ని ప్రతిష్ఠ, బ్రహ్మగణ మండపారాధన, గణపతి హోమం, నైవేద్యం, పంచగవ్యప్రాశన, అంకురారోపణ, మండపారాధన, మండప హోమం, జలాధివాసం, తీర్థప్రసాదముల సమర్పణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పూజలు, సమస్త దేవతా ఆరాధన, సర్వతోభద్ర మండల, ఉపమండపహవాహనం, పోచమ్మ తల్లి దేవతా అభిషేకాలు, మూర్తి హోమాలు, నైవేద్యం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య నిర్వహించారు.